సిటియులో పిజి అడ్మిషన్లకు నోటిఫికేషన్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విజయనగరంలో ఉన్న కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం ద్వారా అందిస్తున్న వివిధ పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సుల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైందని వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ తేజస్వి కట్టమణి తెలిపారు. ఎమ్మెస్సీ కెమిస్ట్రీ, ఎమ్మెస్సీ బయోటెక్నాలజీ, ఎంఎ ట్రైబల్ స్టడీస్, ఎంఎ సోషియాలజీ, ఇంగ్లీషు, మాస్టర్ ఆఫ్ సోషల్ వర్క్, మాస్టర్ ఆఫ్ జర్నలిజమ్ అండ్ మాస్ కమ్యూనికేషన్స్, ఎంబిఎలో అడ్మిషన్‌కు 2024-25 విద్యా సంవత్సరానికి నోటిఫికేషన్ విడుదలైనట్లు తెలిపారు. ఇటీవల నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ) నిర్వహించిన సియు సెట్ పరీక్ష రాసినవారంతా దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని తెలిపారు. విద్యార్థులు www.ctuap.ac.in లో గాని లేదా https://ctu-apcuet.samarth.edu.in/pg ద్వారా తమ పేరును ఈనెల 22న రాత్రి 11:55 నిమిషాల లోపు రిజిస్టర్ చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు యూనివర్సిటీ క్యాంపస్‌లో ఏర్పాటుచేసిన హెల్ప్‌డెస్క్‌ను లేదా, మొబైలు నెంబర్ 6300443499ను గాని యూనివర్సిటీ పని వేళలలో సంప్రదించాలని కట్టమణి తెలిపారు.

పోలింగ్ ముగిసింది. కౌంటింగే మిగిలింది. ఈ నేపథ్యంలో ఎక్కడ ఎవరు గెలుస్తారోనన్న చర్చ జిల్లా వ్యాప్తంగా సాగుతోంది. ఏ ఇద్దరూ కలిసినా ఒకటే చర్చ .. ఆ నియోజకవర్గంలో ఎవరు గెలుస్తారు? ఇక్కడ ఎవరు ఓడిపోతారోనని ఒకటే చర్చ. ఈ క్రమంలో అంతేస్థాయిలో పందేలు ఊపందుకున్నాయి. కొందరు గెలుపు ఓటములపై పందేలా కాస్తే, మరికొందరు మెజార్టీపై బెట్టింగ్‌లు పెడుతున్నారు. ఇప్పటివరకూ ఐపిఎల్ క్రికెట్‌లో పందేలు కాయడం చూసిన ప్రజలు తాజాగా ఎన్నికల్లో గెలుపు ఓటములపై కోట్లాది రూపాయలు పందేలు జరగడం చూసి విస్తుపోతున్నారు.

కాయ్ రాజా కాయ్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్/బొబ్బిలి

ఉమ్మడి జిల్లాలో 11 నియోజకవర్గాలు ఉన్నాయి. దాదాపు అన్ని చోట్లా టిడిపి, వైసిపి మధ్య హోరాహోరా పోటీ జరిగింది. ఎక్కువ నియోజకవర్గాల్లో ఎవరు గెలుస్తారో చెప్పలేని పరిస్థితి ఉంది. అభ్యర్థుల గెలుపోటములపై ఒక లెక్క అయితే, వచ్చే మెజార్టీపై మరో లెక్క. అంతేకాకుండా ప్రభుత్వం ఏర్పాట్లపై మరో పందేం ఇలా రకరకాలుగా జూదం నడుస్తోంది ఇందులో ఒక్కో నియోజకవర్గంపై ఒక్కో రకంగా పందేలు నడుస్తుండటం గమనార్హం. కొన్నిచోట్ల వైసిపికి చెందిన వారు రూ.లక్ష పెడితే టిడిపికి చెందిన వారు రూ.2లక్షలు, మరికొన్ని నియోజకవర్గాల్లో వైసిపి వారు ఎక్కువ, టిడిపి వారు తక్కువ మొత్తంలో పెట్టి బెట్టింగ్‌లు కాస్తున్నారు. తమ అభ్యర్థులు తప్పనిసరిగా గెలుస్తారన్న అంచనాలే ఇందుకు కారణం. కీలకమైన నాయకులు బరిలో ఉన్న చోట పందేలు కూడా ప్రతిష్టాత్మకంగానే మారుతున్నాయి.

ప్రధానంగా విజయనగరం, బొబ్బిలి, ఎస్.కోట, గజపతినగరం, నెల్లిమర్ల, చీపురుపల్లి నియోజకవర్గాల్లో ఎక్కువగా పందేలు జరుగుతున్నాయి. విజయనగరం అసెంబ్లీ స్థానంలో ఏ పార్టీకి ఎన్ని ఓట్లు వస్తాయనే అంశం మొదలుకుని కీలకమైన అభ్యర్థులు సాధించే మెజార్టీల వరకు అన్నింటిపైనా బెట్టింగ్‌లు నడుస్తున్నాయి. వేలల్లో, లక్షల్లో పందేలు సాగుతుండటం విశేషం. నియోజకవర్గంలో టిడిపి కూటమి, వైసిపి అభ్యర్థుల విజయావకాశాలపై బెట్టింగులు జోరుగా సాగుతున్నాయి. దీంతో ప్రధాన పార్టీల, అభ్యర్థుల గెలుపోటములను విశ్లేషించేందుకు ఆయా పార్టీలవారీగా రాజకీయ నిపుణులు రంగంలోకి దిగారు. వీరు బూత్‌ల వారీగా పోలైన ఓట్ల వివరాలు, వాటిలో యువత ఎంతమంది, మహిళలు ఎంత మంది అనే వివరాలు సేకరించి పార్టీలకు ఓట్లు ఎలా పడి ఉంటాయని అంచనాకు వస్తున్నారు. ఆయా బూత్‌ల్లో పార్టీలకు ఉన్న పట్టును కూడా పరిగణనలోకి తీసుకుని గెలుపోటములను అంచనా వేస్తున్నారు. బూత్‌లవారీ లెక్కలు వేసుకుని ఒక అంచనాకు వచ్చిన తర్వాత బెట్టింగ్ కోసం సమాచారాన్ని పంపుతున్నారు.. బెట్టింగ్ బాబుల్లో అధికశాతం ఈసారి ప్రధాన పార్టీల ద్వితీయశ్రేణి నాయకులే ఉండటం గమనార్హం. బెట్టింగ్ కు ముందుకొచ్చిన వారు ముందుగా ఒప్పంద పత్రం రాసుకుంటున్నారు. ఇద్దరూ కలిసి ఒక నమ్మకమైన వ్యక్తి దగ్గర బెట్టింగ్ మొత్తాన్ని ఉంచుతున్నారు. ఫలితం తేలిన తర్వాత ఆ వ్యక్తి ఒప్పందం ఆధారంగా నగదును ఇవ్వాల్సి ఉంటుంది. ఇలా మధ్యవర్తులుగా ఉన్నవారికి భారీగానే గిట్టుబాటవుతోంది. పందెం మొత్తంలో 5 నుంచి 10 శాతం కమీషన్ రూపేణా మధ్యవర్తులకు అందజేయాలని ఒప్పందం కుదుర్చు కుంటున్నారు. వారువేసుకున్న లెక్కలు ఆధారంగా కొంతమంది 100కు 80, మరి కొంతమంది 100 కి 100 అంటూ పందేలు కాస్తున్నారు. డబ్బులు లేని వారు బంగారం,భూములు , కొన్ని వస్తువులకు కూడా పందేలు కాస్తున్నారు.

ఎన్నికల ఫలితాలపై జోరుగా పందేలు

గెలుపు, మెజార్టీపై భారీగా బెట్టింగ్

విజయనగరం నియోజకవర్గంలో ఇప్పటికే సుమారు రూ.30 కోట్ల మేర బెట్టింగులు జరిగినట్లు అంచనా. జూన్ 4న ఫలితాలు వెలువడే నాటికి ఈ బెట్టింగులు రెట్టింపయ్యే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. బొబ్బిలి నియోజకవర్గంలో జోరుగా బెట్టింగులు జరుగుతున్నాయి. టిడిపి, వైసిపికి చెందిన వారు ఎక్కువగా పందేలు కాస్తున్నారు. బేబినాయన గెలుస్తారని రూ.ఒక లక్ష పెడితే వైసిపి గెలుస్తుందని రూ.50 వేలు బెట్టింగ్ వేస్తున్నారు. రాష్ట్రంలో టీడీపీ కూటమి అధికారంలోకి వస్తుందని కొంతమంది బెట్టింగ్ వేయగా వైసిపి అధికారంలోకి వస్తుందని మరికొంతమంది బెట్టింగులు వేస్తున్నారు. బొబ్బిలి పట్టణం, రామభద్రపురం, బాడంగి, తెర్లాం, బొబ్బిలి మండలాల్లో టిడిపి, వైసిపి కార్యకర్తలు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు బెట్టింగులు కాస్తున్నారు. కమీషన్ కోసం కొంతమంది బ్రోకర్లు ఇరు పార్టీల మద్దతుదారులను బెట్టింగులకు ప్రోత్సహిస్తున్నారు.

ఎన్నికలు ముగిసినా

నిర్లక్ష్యం వద్దు

విశాఖపట్నం రేంజ్ డిఐజి విశాల్ గున్ని

సమావేశంలో మాట్లాడుతున్న విశాఖపట్నం రేంజ్ డిఐజి విశాల్ గున్ని

ప్రజాశక్తి-విజయనగరం కోట

ఈనెల 13న జరిగిన సార్వత్రిక ఎన్నికలు తరువాత జరిగిన సంఘటనలు, తీసుకోవాల్సిన భద్రత చర్యలపై విశాఖపట్నం రేంజ్ పరిధిలోని విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల ఎస్‌పిలు, ఇతర పోలీసు అధికారులతో విశాఖ రేంజ్ డిఐజి విశాల్ గున్ని గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం సమీక్షా సమావేశం మరియు జూమ్ మీటింగు నిర్వహించారు.

ఈ సందర్భంగా డిఐజి మాట్లాడుతూ గత రెండునెలలుగా రేంజ్ పరిధిలో పోలీసు అధికారులు, సిబ్బంది చాలా కష్టపడి, ప్రణాళికాబద్ధంగా క్షేత్ర స్థాయిలో సమర్ధవంతంగా పని చేయడం వల్ల ఈ నెల 13న జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో చిన్న చిన్న సంఘటనలు మినహా ప్రశాంతయుతంగా నిర్వహించుకోగలిగామని చెప్పారు. అందుకు కృషి చేసిన అధికారులు, సిబ్బందిని ఆయన అభినందించారు. ఎన్నికల తరువాత మన ప్రాంతం ప్రశాంతంగా ఉందన్న నిర్లక్ష్యం వద్దని, మరో 15రోజులు ప్రతీ ఒక్కరూ ఇదే స్ఫూర్తి, నిబద్ధతతో పని చేయాలని ఆదేశించారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఉద్రిక్త పరిస్థితులు ఉన్నాయని, మన ప్రాంతంలో ఎటువంటి శాంతిభద్రతల సమస్యలూ ఉత్పన్నం కాకుండా క్షేత్ర స్థాయిలో మరింత సమర్థవంతంగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. పోలింగుకు కొద్ది రోజులు ముందు, పోలింగు రోజు, పోలింగు తరువాత గ్రామాల్లోచోటు చేసుకున్న చిన్న చిన్న సంఘటనల పట్ల నిర్లక్ష్యం వద్దని, ఆయా గ్రామాలను అధికారులు పలుమార్లు సందర్శించాలని, గ్రామ పెద్దలు, గ్రామస్థులతో మమేకమై, వారిని వివాదాలకు దూరంగా ఉండాలని, ఒకరితో ఒకరు శాంతియుతంగా మెలగాలని విజ్ఞప్తి చేయాలన్నారు.

గ్రామాల్లో చురుకుగా ఉన్న వ్యక్తులను, రాజకీయంగా వివాదాలు సృష్టించే వ్యక్తులను గుర్తించి, వారిని పోలీసు స్టేషనుకు పిలిచి, కౌన్సిలింగు చేయాలని, క్షేత్ర స్థాయిలో రాజకీయ పార్టీలకు అతీతంగా, పారదర్శకంగా, నిష్పక్షపాతంగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు. ఓటు వేసేందుకు ఇతర ప్రాంతాల నుండి స్వగ్రామాలకు వచ్చిన వ్యక్తులు వలన ఏమైనా సమస్యలు తలెత్తే అవకాశం ఉన్న వారిని గుర్తించి, వారిపై ప్రత్యేకంగా నిఘా పెట్టాలన్నారు. వివాదాలు తలెత్తేందుకు అవకాశం ఉన్న గ్రామాలను గుర్తించి, పోలీసు పికెట్లును ఏర్పాటు చేయాలని, ఆయా గ్రామాల్లో పరిస్థితులను, సమాచారాన్ని ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు తెలపాలన్నారు. గ్రామాల్లోకి క్రొత్తగా వచ్చే వ్యక్తులను గుర్తించి, వారు గ్రామానికి ఏ పని మీద వచ్చినది, ఎందుకు వచ్చినది తెలుసుకోవాలని, ఆయా అంశాలను పాయింట్ బుక్కుల్లో నమోదు చేయాలన్నారు. స్థానిక నాయకులు పోలీసు స్టేషనుకు వచ్చే ఫిర్యాదులను తమ రాజకీయ అవసరాలకు వాడుకునే అవకాశం ఉన్నందున, ఏ చిన్న ఫిర్యాదు వచ్చినా, చట్ట పరిధిలో చర్యలు చేపట్టాలన్నారు. ఇవిఎంలను భద్రపర్చిన స్ట్రాంగు రూమ్స్ వద్ద మూడంచెల భద్రతను ఇప్పటికే ఏర్పాటు చేసామని, వాటిని నిరంతరం అధికారులు తనిఖీలు చేపట్టి, భద్రతను పర్యవేక్షించాలన్నారు. రాబోయే 15 రోజులు మరింత జాగ్రత్తగా వ్యవహరించాలని, ఏ చిన్న సంఘటనను తేలికగా తీసుకోవద్దని, రాజకీయాలకు అతీతంగా పని చేయాలని, నిష్పక్షపాతంగా వ్యవహరించాలని, వివాదాలు జరిగేందుకు అవకాశం ఉన్న గ్రామాలను, వ్యక్తులను గుర్తించి, ప్రత్యేకంగా నిఘా పెట్టాలని అధికారులను ఆదేశించారు. అనంతరం, ఎన్నికల తరువాత వివిధ పోలీసు స్టేషనుల్లో నమోదైన కేసులను విశాఖ రేంజ్ డిఐజి సమీక్షించి దర్యాప్తులో నిష్పక్షపాతంగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు. జూన్ 4న జరిగే కౌంటింగు నిర్వహించే కేంద్రాల వద్ద కూడా భద్రత ఏర్పాట్లు చేపట్టాలని, వాటిని జిల్లా ఎస్‌పిలు ముందుగానే సమీక్షించాలని డిఐజి ఆదేశించారు.

సమావేశంలో విజయనగరం జిల్లా ఎస్‌పి ఎం. దీపిక, మన్యం జిల్లా ఎస్‌పి విక్రాంత్ పాటిల్, శ్రీకాకుళం జిల్లా ఎస్‌పి జిఆర్ రాధిక, అనకాపల్లి జిల్లా ఎస్‌పి కెవిమురళీ కృష్ణ, అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్‌పితుషీం సిన్హా, విజయనగరం అదనపు ఎస్‌పిలు అస్మా ఫర్వీన్, శ్రీకాకుళం అదనపు ఎస్‌పి ప్రేమ్ కాజల్, పార్వతీపురం మన్యం అదనపు ఎస్‌పి ఒ.దిలీప్ కిరణ్, పార్వతీపురం ఎఎస్‌పి సునీల్ షరోన్, ట్రెయినీ ఐపిఎస్ ఎం.జావలి, డిఎస్‌పిలు, సిఐలు పాల్గొన్నారు.

ఓటు వినియోగంలో

పట్టణాల్లో పెరగని ఆసక్తి

- **నెల్లిమర్లలో అత్యధికంగా 88.25 శాతం పోలింగ్**
- **విజయనగరంలో అత్యల్పంగా 71.84శాతం ఓట్ల నమోదు**

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

పాలకపార్టీలకు చెందిన రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులపై నమ్మకం సడలుతోందో లేక రాజకీయాలపైనే ఆసక్తి తగ్గిపోతోందో... ప్రభుత్వ పథకాలు రుచించడం లేదో.. కారణమేదైనా పట్టణ ప్రాంతాల్లో ఓటర్ల ఆసక్తి తగ్గింది. సార్వత్రిక ఎన్నికల్లో విద్యలకు నిలయంగావున్న విజయనగరంలో ఓటింగ్ శాతం పెరగకపోవడం, ఉమ్మడి జిల్లాలోనే అత్యల్పంగా నమోదు కావడం ఇందుకు తార్కాణంగా చెప్పుకోవచ్చు. విజయనగరం జిల్లాలోని ఏడు, పార్వతీపురం మన్యం జిల్లాలో నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. వీటిలో విజయనగరం నియోజకవర్గంలో అత్యల్పంగా 71.84శాతం ఓట్లు మాత్రమే నమోదు అయ్యాయి. ఇదే నియోజకవర్గంలో 2014లో 71.71.28శాతం, 2019లో 70.81శాతం ఓట్లు నమోదయ్యాయి. దీన్నిబట్టి విజయనగరంలో ఓటింగ్ పెద్దగా పెరుగుదల లేదన్నది అర్థమౌతోంది. ప్రస్తుత ఎన్నికల్లో మొత్తంగా 2,67,205 మంది ఓటర్లు ఉండగా కేవలం 1,84,787మంది మాత్రమే తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఓటుహక్కు వినియోగించుకున్న వారిలో పురుషులు 89,886 మంది కాగా, మహిళలు 94,894 మంది ఉన్నారు. మరో ఏడుగురు థర్డ్ జెండర్స్ ఉన్నారు. దీన్నిబట్టి ఓటర్ల సంఖ్యలోనూ, ఓటు హక్కు వినియోగించుకున్నవారిలోనూ పురుషులకన్నా మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారన్నది కూడా స్పష్టమౌతోంది. ఇదే నియోజకవర్గానికి ఆనుకునివున్న నెల్లిమర్ల నియోజకవర్గంలో అత్యధికంగా 88.25శాతం ఓటింగ్ నమోదు అయ్యింది. ఇక్కడ తొలి నుంచీ ఓటర్ల చైతన్యం ఎక్కువగా కనిపిస్తోంది. ఇక్కడ 2019లో 87.81శాతం, 71.28శాతం ఓట్లు నమోదయ్యాయి. ఈయా ఎన్నికల్లో సగటు నియోజకవర్గ ఓటరు సరళిని పరిశీలిస్తే ఈ నియోజకవర్గంలోనే అత్యధికం శాతం ఓట్లు నమోదయ్యాయి. ప్రస్తుత ఎన్నికల్లో మొత్తం 2,13,551 మంది ఓటర్లకుగాను 1,88,456 ఓట్లు మొదయ్యాయి. ఇక్కడ వలసఓటర్లను సమీకరించడంలో ఇటు వైసిపి, అటు టిడిపి విజయవంతమయ్యాయి. విజయనగరంలో ఆ విధమైన ప్రయత్నం తక్కువగా ఉంది. కాస్త ఎగువ మధ్యతరగతి వాసులు ఓటు వేసేందుకు పెద్దగా ఆసక్తి చూపలేదు. రెండు పార్టీల మేనిఫెస్టోల్లో కేవలం సంక్షేమ పథకాలు మాత్రమే ఉండడం, అభివృద్ధి, ఉపాధి, ఉద్యోగ అవకాశాల కల్పనకు సంబంధించినవేమీ లేకపోవడం, పన్నుల భారం తదితర అంశాలు విజయనగరంలో పోలింగ్ శాతం పెరగకపోవడడానికి కారణమై ఉంటాయని పలువురు విశ్లేషిస్తున్నారు. అయితే, పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ వినియోగించుకున్నవారిలో మాత్రం విజయనగరం నియోజకవర్గవాసులే ఎక్కువ మంది ఉన్నారు. జిల్లా వ్యాప్తంగా 18,869 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు నమోదు కాగా, ఇక్కడ అత్యధికంగా 4,201ఓట్లు నమోదయ్యాయి. అయినప్పటికీ మొత్తంగా పరిశీలించినప్పుడు విజయనగరంలో పాలకొండ, సాలూరు, కురుపాం వంటి గిరిజన ప్రాంత నియోజకవర్గాలకన్నా ఓటింగ్ శాతం తక్కువగానే నమోదైంది. విజయనగరంలోని ఏడు నియోజకవర్గాల్లో విజయనగరం కన్నా కాస్తంత ఎక్కువగా 76శాతం ఓట్లు నమోదు కాగా, మిగిలిన అన్ని నియోజకవర్గాల్లోనూ 80శాతం పైబడి ఓటింగ్ శాతం నమోదైంది.

పోలింగ్ కేంద్రం వద్ద క్యూలో వేచి ఉన్న ఓటర్లు (ఫైల్)

జిల్లాలో ఎంతో నేర్చుకున్నా

- **మంచి సేవలు అందించే ప్రయత్నం చేస్తా**
- **ట్రైయినీ సహాయ కలెక్టర్ వెంకట్ త్రివినాగ్**
- **జిల్లాలో శిక్షణ పూర్తి**

మీడియాతో మాట్లాడుతున్న ట్రైయినీ సహాయ కలెక్టర్ త్రివినాగ్

ప్రజాశక్తి-విజయనగరం కోట

జిల్లాలో గత ఏడాది కాలంలో వివిధ హోదాల్లో పొందిన శిక్షణ ద్వారా ఎన్నో పరిపాలనపరమైన అంశాలను నేర్చుకున్నానని, ఈ అనుభవంతో రానున్న రోజుల్లో ప్రజలకు మంచి సేవలు అందించే ప్రయత్నం చేస్తానని జిల్లాలో శిక్షణ పూర్తిచేసుకున్న ట్రెయినీ సహాయ కలెక్టర్ బి.సహాదిత్ వెంకట త్రివినాగ్ తెలిపారు. జిల్లాలో పనిచేసిన కాలంలో సార్వత్రిక ఎన్నికల నిర్వహణతో పాటు రైలు ప్రమాద దుర్ఘటన, ఇతర విపత్తుల సమయంలో ఏవిధంగా వ్యవహరించాలనే అంశాలను నేర్చుకున్నట్టు చెప్పారు. జిల్లాలో గత ఏడాది మే 25న శిక్షణకోసం చేరానని, నిన్నటితో శిక్షణ పూర్తయిందని తెలిపారు. జిల్లాలో చీపురుపల్లిలో ఆర్‌డిఒగా, మెంటాడలో తహశీల్దార్‌గా శిక్షణ పొందానని పేర్కొన్నారు. వివిధ హోదాల్లో, వివిధ ప్రభుత్వశాఖల్లో ఏయే విధులు నిర్వహిస్తారనే అంశాలపై అవగాహన కలిగిందన్నారు. అదేవిధంగా ప్రోటోకాల్ నిర్వహణ అంశాలపై కూడా అవగాహన ఏర్పరచుకున్నట్టు చెప్పారు.

ఎన్నికల నిర్వహణలో భాగంగా ఓటర్లను చైతన్యపరిచేందుకు చేపట్టిన స్వీప్ కార్యక్రమాల్లో భాగస్వాములయ్యానని, ఈ కార్యక్రమాల ద్వారా జిల్లాలో ప్రస్తుత ఎన్నికల్లో రెండు శాతం మేరకు ఓటింగ్ పెంచగలిగామన్నారు. ఎన్నికల సందర్భంగా తనను జిల్లా ఫ్లయింగ్ స్క్వాడ్ మెంబర్‌గా నియమించారని ఎన్నికల్లో మద్యం, డబ్బు పంపిణీని నియంత్రించేందుకు పలు చోట్ల దాడులు నిర్వహించి, మద్యం నిల్వలను స్వాధీనం చేసుకునే దిశగా తమ బృందం పనిచేసిందని తెలిపారు. నెల్లిమర్లలో వున్న మద్యం డిపో నుంచి మద్యం నిల్వలపై పర్యవేక్షణ చేశామన్నారు.

జిల్లాలో శిక్షణ పొందిన కాలంలో జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, జాయింట్ కలెక్టర్‌లు మయూర్ అశోక్, కార్తీక్‌లు తనకు ఎంతగానో సహకరించి ప్రోత్సహించారని చెప్పారు. విజయనగరం జిల్లాకు రానున్న రోజుల్లో ఎంతో భవిష్యత్తు వుందన్నారు. భోగాపురం ఎయిర్‌పోర్టు కార్యకలాపాలు మొదలయ్యాక ఈ ప్రాంతం ఆర్థికపరంగా అభివృద్ధి చెందుతుందన్నారు. మెటలర్జీలో బి.టెక్ పూర్తిచేసిన తనకు తన తండ్రి బి.జయకుమార్ సివిల్ సర్వీసెస్‌లో చేరేందుకు ఎంతగానో స్ఫూర్తినిచ్చారని చెప్పారు. ట్రైనీ సహాయ కలెక్టర్ వచ్చే రెండునెలల కాలంలో కేంద్ర ప్రభుత్వ ఆర్థిక మంత్రిత్వశాఖలో శిక్షణ చేపట్టేందుకు న్యూఢిల్లీ వెళ్లనున్నారు.

ఇంకా అందని పింఛన్లు

- **కాలం చెల్లిన ఖాతాల్లో నగదు జమ**
- **15 రోజులు కావస్తున్నా రాని డబ్బులు**
- **బ్యాంకుల్లో పడిగాపులు కాస్తున్న వృద్ధులు**
- **ఇప్పట్లో ఇవ్వలేమంటున్న బ్యాంకు అధికారులు**
- **లబోదిబోమంటున్న పింఛనుదారులు**

బ్యాంకులో బారులు తీరిన పింఛనుదారులు

ఇంటి వద్దకే పింఛన్ డబ్బులు పంపిణీ చేసే అవకాశం ఉన్నా ప్రభుత్వం మాత్రం కావాలనే రకరకాల సాకులు చెప్పి జాప్యం చేసి వృద్ధులను, వికలాంగులను, వితంతువులను రోడ్ల మీదకు రప్పించి నానా తిప్పలు పెట్టిందనడంలో సందేహం లేదు. మే నెలకు సంబంధించి ప్రభుత్వం ఇచ్చే సామాజిక పింఛన్లు సొమ్మును లబ్ధి దారులకు నేరుగా బ్యాంకు ఖాతాలలో జమ చేయడంతో ఆ డబ్బులు తీసుకొనేందుకు బ్యాంకుల చుట్టూ గత 15 రోజులుగా తిరుగుతున్నారు.

ప్రజాశక్తి- చీపురుపల్లి

రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికల కోడ్ ఉన్నందున వాలంటీర్ల సేవలను నిలిపివేయడంతో ఇంటింటికి పంపిణీ చేయాల్సిన పింఛన్ల డబ్బు లబ్దిదారుల ఖాతాలకు ప్రభుత్వం జమ చేసింది. అయితే డబ్బులు తీసుకునేందుకు బ్యాంకులకు వెళ్లిన పింఛనుదారులకు అక్కడ ఎదురు దెబ్బ తగిలింది. మీవి జీరో అకౌంట్‌లు కావడంతో ఎప్పుడో కాలం చెల్లిపోయాయని తిరిగి కొత్త ఖాతాలు తెరుచుకోవాలని బ్యాంకు అధికారులు చెప్పడంతో పింఛనర్లు అవాక్కయ్యారు. దీంతో చేసేది లేక తమకు రావలసిన డబ్బులు కోసం ప్రతీ రోజు ఉదయాన్నే బ్యాంకుల వద్ద క్యూ కడుతూ తమకు కొత్త ఖాతాలు తెరిచి తమ పింఛను డబ్బులు తమకు ఇవ్వాలని అధికారులను అడుగుతున్నారు. అయినప్పటికీ సంబంధిత బ్యాంకు అధికారులు కొత్త ఖాతాలు ఓపెన్ చేయడానికి కనీసం 15 రోజులు పడుతుందని చెప్పడంతో వృద్దులు ఎండలోనే ఉండి ఇబ్బందులు పడుతున్నారు. తమ డబ్బులు వస్తే మందుల కోసం, తమ సొంత అవసరాలు కోసం ఉపయోగపడతాయని చెబుతున్నారు. ఈ వృద్దాప్యంలో తమని ఇలా ఇబ్బందులకు గురి చేయడం సమంజసం కాదంటూ ప్రభుత్వ పెద్దలను, ఇటు అధికారులను, బ్యాంకు సిబ్బందిని అడుగుతూ వాపోతున్నారు.

జన్‌ధన్ ఖాతాలే కొంప ముంచాయా?

దేశంలో బిజెపి ప్రభుత్వం ఏర్పాటయ్యాక దేశంలో ఉన్న ప్రతి ఒక్కరినీ లక్షాధికారిని చేస్తామని చెప్పి జీరో బ్యాలెన్స్ అకౌంట్లు ఓపెన్ చేయించింది. ప్రభుత్వం అందజేస్తున్న ప్రతి పథకం డబ్బులు కూడా జన్‌ధన్ ఖాతాలోనే జమ అవుతాయని కేంద్ర ప్రభుత్వం చెప్పడంతో ప్రజలు అప్పటిలో పెద్ద ఎత్తున పలు బ్యాంకుల్లో జీరో అకౌంట్లు ఓపెన్ చేశారు. అయితే ప్రభుత్వం ఏడాది ఒకసారైనా వారి ఖాతాల్లో ఎటువంటి డబ్బులూ జమ చేయకపోవడంతో ఆయా ఖాతాలు కాలం చెల్లిపోయాయి. ఇవేమీ పట్టించుకోకుండా రాష్ట్ర ప్రభుత్వం మే నెలకు సంబంధించి పింఛనుదారుల డబ్బులను ఆ అకౌంట్లలో జమ చేయడంతో సంబంధిత బ్యాంకులు అడ్డు చెప్పాయి. ఖాతాలలో డబ్బులు పడ్డాయి గాని సంబంధిత ఖాతాలన్నీ కాలం చెల్లిపోయాయని బ్యాంకు అధికారులు చెప్పడంతో పింఛనుదారులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో వారికి ప్రభుత్వం జమ చేసిన డబ్బులు కోసం తిరగరాని చోటల్లా తిరుగుతూ తమకు కొత్త ఖాతాలో ఓపెన్ చేసి తమ డబ్బులు ఇవ్వాలని వాపోతున్నారు.

మండలంలో 8824 మంది పింఛనుదారులు

మండలంలో వివిధ కేటగిరీలకు సంబంధించి 8,824 మంది పింఛనుదారులు ఉన్నారు. వీరిలో వృద్ధాప్య పింఛన్లు 4,446, వితంతువులు 2034, వీవర్స్ 57, వికలాంగులు 1283, తొడ్డి టప్పర్స్ 53, అభయ హస్తం 502, మత్స్యకార 5, ఒంటరి మహిళలు 162, డప్పు కళాకారులు 143, ట్రెడిషినల్ కొబ్బలెర్స్ 90, సికెడియు 5, మెడికల్ డిపార్ట్‌మెంట్ 23, కళాకారులు 21 మంది ఉన్నారు. వీరిలో చాలా మందికి సంబంధించిన పింఛన్లు బ్యాంకు ఖాతాలలోని జమ కావడంతో వారందరూ 15 రోజుల గడుస్తున్నప్పటికీ ఫించన్లకు నోచుకోలేదు. తమ డబ్బులు తమకు ఇప్పించి పుణ్యం కట్టుకోవాలని ప్రభుత్వ పెద్దలను, అధికారులను, బ్యాంకు అధికారులను కోరుతున్నారు.

ఎన్నికల విధుల రెమ్యునరేషన్ చెల్లించాలి

ఏజెంట్ల దాడిపై విచారణ చేయాలి : పిఆర్‌టియు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఎన్నికల విధులు నిర్వహించిన పిఒ, ఎపిఒ, ఒపిఒలకు మూడు రోజులకు రెమ్యూనరేషన్ చెల్లించాలని, ఎర్నడ్ లీవ్ పొందేందుకు ఎంఇఒల ద్వారా డ్యూటీ సర్టిఫికెట్లు ఉపాధ్యాయులకు అందజేయాలని పిఆర్‌టియు జిల్లా గౌరవాధ్యక్షులు రాంబాబు, అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు రవీంద్ర నాయుడు, డి.శ్రీనివాసరావు కోరారు. గజపతినగరం నియోజకవర్గంలో ఎన్నికల విధులలో ఉన్న పిఒపై జరిగిన దాడిని ఖండించారు. ఈ విషయంలో సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై తగు చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. 10 రోజులకు పైగా ఎన్నికల విధులు నిర్వర్తించిన మాస్టర్ ట్రైనీ లకు తగు రెమ్యూనరేషన్ తో పాటు డ్యూటీ సర్టిఫికెట్స్ అందచేయాలని కోరారు. ఈ ఎన్నికలలో ఒక్కో పోలింగ్ స్టేషన్‌కు 1000 నుండి 1200 ఓట్లు కేటాయించారని, పని ఒత్తిడి రీత్యా భవిష్యత్తు ఎన్నికల్లో 800 ఓట్లకు ఒక పోలింగ్ స్టేషన్ ఏర్పాటు చేయాలని కోరారు.

గురుకులంలో 13 మందికి అడ్మిషన్లు

ప్రజాశక్తి-బొబ్బిలి

మండలంలోని కారాడ వద్దనున్న మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలలో చదివిన 13 మంది విద్యార్థులు గురుకుల జూనియర్ కళాశాలల్లో అడ్మిషన్లు సాధించినట్లు ప్రిన్సిపల్ జి.పురుషోది ఒక ప్రకటనలో తెలిపారు. విశాఖ జిల్లా సింహాచలం కళాశాలలో పి.ప్రశాంత్, ఎన్.మహేష్, కె.కె.ఎస్.ఎస్.గౌతమ్, బి.తరుణ్, వై.యశ్వంత్, ఎన్.ధనుంజయ, ఆర్.మురళీకృష్ణ, చిత్తూరు జిల్లాలోని సోడుమ్ కళాశాలలో బి.రవిప్రకాశ్, ఒ.సాయి, పి.వినయ్‌కుమార్ దొర, నెల్లూరు జిల్లాలోని దొరవారిసత్రం కళాశాలలో పి.హేమంత్ నాయుడు, పి.రవీంద్ర, కర్నూలు జిల్లా బేతమంచర్ల కళాశాలలో జి.యశ్వంత్ అడ్మిషన్లు సాధించారని చెప్పారు. పదిలో మంచి మార్కులు సాధించడం వల్ల సీట్లు సాధించారని తెలిపారు. వీరిని ప్రిన్సిపల్, అధ్యాపకులు అభినందించారు.

శిథిలావస్థకు చేరిన కాజ్‌వే

శిథిలావస్థలో సింగరాయి కాజ్‌వే

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని సింగరాయి గ్రామంలో ఉన్న కాజ్‌వే శిథిలావస్థకు చేరింది. కూలడానికి సిద్ధంగా ఉంది. సింగరాయిలో కోమటి చెరువు, ఊరచెరువు మధ్య మారిక గెడ్డ నుంచి వచ్చే నీటి ప్రవాహానికి ఇబ్బంది లేకుండా కాజ్‌వే నిర్మించారు. పాత, కొత్త సింగరాయితోపాటు బిడిపాలెం, వెంకయ్యపాలెం ప్రజలు కాజ్‌వే మీదుగా రాకపోకలు సాగిస్తుంటారు. పంటలను దీని మీదుగానే కళ్లాలకు తరలించాలి. వర్షాకాలంలో విపరీతంగా వర్షపు నీరు ప్రవహిస్తే ప్రమాద సాయి కూడా చేరుకుంటుంది. ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితి నెలకొంది. కొత్త వంతెన ఏర్పాటుపై పాలకులు దృష్టిపెట్టడం లేదు.

19న పలు వార్డులకు నీటి సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విజయనగరానికి నీటిసరఫరా చేస్తున్న ప్రధాన నీటి సరఫరా కేంద్రమైన ముషిడిపల్లి వాటర్ వర్క్స్ నుండి కంటోన్మెంట్ రిజర్వాయరు వరకు గల 600 ఎంఎం పైపులైన్‌లో ఏర్పడిన లీకులను సరిచేసేందుకు ఈనెల 19న పలు వార్డులకు నీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు నగర పాలక సంస్థ కమిషనర్ ఎంఎం నాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కంటోన్మెంట్, బాలాజీనగర్ ట్యాంక్, కొత్తఅగ్రహారం, పుత్సలవీధి, హుకుంపేట, లంకాపట్నం, తూర్పు బలిజివీధి, పడమట బలిజి వీధి, నాగవంశం వీధి, కొత్తదేవర వీధి, బొండాడ వీధి, ఉల్లి వీధి, కణపాక, కెఎల్ పురం, గంజిపేట, బాలాజీ మార్కెట్ రోడ్, సంజీవరావు కాలనీ, గొల్లవీధి పార్కు, రైల్వేస్టేషన్, బాలాజీ నగర్, తోటపాలెం, సిద్ధార్థ నగర్, ప్రదీప్ నగర్ ప్రాంతాలకు నీటి సరఫరా ఉండదని తెలిపారు. ప్రజలంతా సహకరించాలని కోరారు.

18న వాసవీమాత జయంతి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతి సందర్భంగా ఈనెల 18న ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు ఆరవెల్లి ఉమామహేశ్వరరావు తెలిపారు. గురువారం దేవాలయం కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేవాలయం గౌరవ అధ్యక్షులు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి సలహాలు సూచనలతో అధ్యక్షుడు నారాయణం శ్రీనివాస్ ఆధ్వర్యంలో అమ్మవారి జయంతి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. శనివారంఉదయం 5 గంటల నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, కుంకుమార్చనలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

వ్యర్థాలతో ఉపయోగాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న జియో సభ్యులు

జియోను సందర్శించిన ఆదిత్య విద్యార్థులు

ప్రజాశక్తి-శృంగవరపుకోట

విశాఖపట్నానికి చెందిన ఆదిత్య కళాశాల బిఎస్‌సి డేటా సైన్సు విద్యార్థులు స్థానిక గ్రీన్ ఎర్త్ ఆర్గనైజేషన్ (జియో)ను గురువారం సందర్శించారు. కమ్యూనిటీ సైన్సు ప్రాజెక్టులో భాగంగా పలు అంశాలపై అవగాహన నిమిత్తం క్షేత్ర పరిశీలనకు వచ్చారని జియో వ్యవస్థాపకులు బి.రామకృష్ణ, డైరెక్టర్ వై.విజయలక్ష్మి తెలిపారు. పర్యావరణ పరిరక్షణ, జీవ వైవిధ్య సంరక్షణ, పరిశుభ్రత, సేంద్రియ వ్యవసాయం, ప్లాస్టిక్, పాలథీన్ రహిత పర్యావరణం, నర్సరీ అభివృద్ధి, సామాజిక అడవుల పెంపకం, తదితర అంశాల గురించి వారు విద్యార్థులకు విపులంగా వివరించారు. టెక్నో విలేజ్ వ్యవస్థాపకులు చదరం గణేష్ సేంద్రియ వ్యవసాయం గురించి తన వ్యవసాయ క్షేత్రంలో వివరించారు. ఎస్.కోట సర్పంచి గనివాడ సంతోషి కుమారి సూచన మేరకు నానిగిరి కృష్ణ తడి, పొడి చెత్త సేకరణ గురించి పంచాయతీ కార్యాలయం వద్ద విద్యార్థులకు తెలియజేశారు.

బెదిరించిన నలుగురు అరెస్టు

ప్రజాశక్తి-విజయనగరం కోట

నగరంలోని ఒక హోటల్‌కు వెళ్ళిన నలుగురు యువకులు తాము ఫుడ్ కార్పొరేషన్ ఉద్యోగులమని, తమకు డబ్బులు ఇవ్వాలని, లేకుంటే తనిఖీలు చేస్తామని బెదిరింపులకు పాల్పడ్డారు. ఈనేపథ్యంలో హోటల్ నిర్వాహకుల ఫిర్యాదు మేరకు వారిని అరెస్టు చేసినట్లుగా వన్ టౌన్ ఎస్ఐ హరిబాబు నాయుడు గురువారం తెలిపారు గరివిడికి చెందిన గొర్లె మహేశ్వరరావు, విశాఖపట్నం మధురవాడకు చెందిన అరసాడ కిరణ్, పార్వతీపురం మన్యం జిల్లా నర్సిపురానికి చెందిన తర్లాడ దయానంద్, తెర్లాం మండలం కొరటాం గ్రామానికి చెందిన లావేటి కామేశ్వరరావు బృందంగా ఏర్పడి నగరంలోని ఒక హోటల్‌కు వెళ్లారు. ఎఫ్‌సిఐ ఉద్యోగులమని పరిచయం చేసుకొని, తమకు డబ్బులు ఇవ్వాలని, లేకుంటే తనిఖీలు చేపడతామని బెదిరింపులకు పాల్పడ్డారు. విషయం తెలుసుకున్న వన్ టౌన్ ఎస్ఐ హరిబాబు నాయుడు హోటల్ కి వెళ్లి, విచారణ చెయ్యగా, డబ్బులు కోసం ఉద్యోగులుగా అబద్ధం చెప్పామని తెలపడంతో వన్ టౌన్ పోలీసులు వారిపై కేసు నమోదు చేశారు.

అంతు చిక్కని ఓటరు నాడి

- ఆమె ఓటు ఎవరికో..?
- అయోమయంలో నెల్లిమర్ల నేతలు

కూటమి ప్రకటించిన సూర్

ప్రజాశక్తి - పూసపాటిరేగ

'లేచింది.. నిద్ర లేచింది మహిళా లోకం.. దద్దరిల్లింది పురుష ప్రపంచం' అంటూ అలనాటి సినిమా గీతం నేడు నెల్లిమర్ల నియోజకవర్గ రాజకీయ శిబిరాల్లో చక్కర్ల కొడుతోంది. నియోజకవర్గంలో అత్యధికంగా మహిళా ఓటర్లు ఉండడమే కాకుండా ఓటు హక్కును వినియోగించుకున్నది మహిళలేనని అధికారిక లెక్కలు తేల్చేశాయి. ఈ నేపథ్యంలో ప్రధాన రాజకీయ పార్టీల నాయకులు గెలుపోటములు అంచనాలు వేయడంలో తలలు పట్టుకుంటున్నారు. రెండు రోజులుగా గ్రామాల వారీగా లెక్కలు వేసుకుంటున్నారు. అయినా మహిళ మనస్సులో ఏముందో లెక్క లేలడం లేదు.. అంతు చిక్కడం లేదు. ఇంత పెద్ద ఎత్తున మహిళల్లో వెల్లువిరిచిన చైతన్యం ఎవరికి పట్టం కట్టిందో? ఎవరిని పక్కన పెట్టిందో? అని తలలు పట్టుకుంటున్నారు.

జిల్లాలోనే నెల్లిమర్ల నియోజకవర్గం అత్యధికంగా పోలింగ్ నమోదు చేసుకుని రికార్డు నెలకొల్పిన విషయం తెలిసిందే. ఈ ఎన్నికల్లో అందరి దృష్టి నెల్లిమర్ల పోలింగ్‌పై పడేటట్టు చేసింది. నెల్లిమర్ల నియోజకవర్గంలో మొత్తం 2,13,551 ఓటర్లుండగా 1,88,456 మంది ఓటు హక్కును వినియోగించుకొని 88.25 శాతం నమోదై రికార్డు నెలకొల్పారు. నియోజకవర్గంలో పురుషులు కన్నా మహిళా ఓటర్లే ఎక్కువగా ఉన్న సంగతి తెలిసిందే. ఓటు హక్కును కూడా మహిళలే ఎక్కువగా వినియోగించుకున్నారు. అంటే 1,88,456 ఓట్లు నమోదవగా అందులో అత్యధికంగా మహిళలు 95,635 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇప్పుడదే నెల్లిమర్ల నియోజకవర్గం నేతలు తలలు పట్టుకునేలా చేసింది. మహిళా ఓట్లు ఎవరికి వెళ్లినట్లు...? ఎన్నడూ లేని విధంగా ఇంత మొత్తంలో మహిళా చైతన్యం ఎందుకు వచ్చింది...? అన్నది చర్చకు దారి తీసింది. తాము గెలుస్తామంటే తాము గెలుస్తామని అధికార వైసిపి, ఎన్‌డిఎ కూటమి అభ్యర్థులు

మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నా లోలోపల మధన పడుతున్నారు. దీని వెనుక మహిళలు అత్యధికంగా ఓటు హక్కు నమోదు చేసుకోవడమే కారణంగా తెలిస్తోంది.

మహిళా ఎవరి వైపు..?

మహిళా ఓట్లు ఎవరివైపు వెలతాయన్నది ప్రధానంగా చర్చనీయాంశమవుతోంది. అధికార వైసిపి ప్రభుత్వం మహిళకు ప్రాధాన్యత ఇచ్చిందనే చెప్పాలి. ఎందుకంటే ఏ ప్రభుత్వ పథకమైనా మహిళకే నేరుగా అందించింది. అమ్మఒడితోపాటు కాపునేస్తం, చేదోడు, ఆసరా లాంటి పథకాలతో ఆకర్షితులైన మహిళలు ఎక్కువగా వైసిపికి పట్టం కట్టారా అన్నది చర్చ ఉండగా మరో వైపు ఎన్‌డిఎ సిక్స్ మహిళలను ఆకట్టుకున్న సంగతి కొంత మంది చెబుతున్నారు. ఎందుకంటే సూపర్ సిక్స్‌లో అమ్మఒడితో పాటు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, మహిళలకు నెలకు రూ.1500 సహాయం, మూడు గ్యాస్ బండలు ఇవి మహిళలను ఒకింత ఆకర్షణకు గురి చేసి ఉండొచ్చు. పైగా కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కూడా మహిళా కావడం కూడా వారికి కలిసి వచ్చే అంశంగా చర్చించుకుంటున్నారు. అయితే మహిళలు ఏ పథకాలకు ఆకర్షితులై ఇలా వెల్లువలా ఓట్లు వేయడానికి క్యూ కట్టారన్నది అంతుచిక్కడం లేదు. గెలిచేది ఎవరో తేల్చేది మహిళలేనని నిర్ణయానికి వచ్చేసారు. మహిళలు మాత్రం ఎవరికి పట్టం కట్టారో గుట్టు విప్పడం లేదు. ఫలితాలు వచ్చే వరకూ మహిళలు మనస్సులో ఏవరున్నారో వేచి చూడాల్సిందేనని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

ఎవిపురంలో ఇంటర్ విద్య ప్రారంభం

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని అంబాడ వెంకటాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను అప్‌గ్రేడ్ చేసి ఇంటర్ విద్యను గురువారం బొబ్బిలి డివిజన్ డిప్యూటీ డిఇఒ కలిగెట్ల మోహన్‌రావు ప్రారంభించారు. ప్రజాశక్తిలో కళాశాల విద్యకు దూరం అనే కథనానికి ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, ఎమ్మెల్యే కంబాల జోగులు జిల్లా విద్యాశాఖ అధికారులు ప్రజాశక్తి క్లిప్పింగ్ తోపాటు వినతి రూపంలో ఉన్నతాధికారులకు అందించారు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి, ఆర్‌జెడికి నివేదికలు అందించడంతో తక్షణమే రేగిడి మండలానికి ఇంటర్ విద్య కోసం కళాశాలను మంజూరు చేశారు. అయితే అంబాడ వెంకటాపురం హైస్కూల్లో ప్రస్తుతం ఎంపిసి, సిఇసి గ్రూపులకు మాత్రమే దరఖాస్తుల స్వీకరిస్తున్నారు. ఇప్పటివరకు రెండు గ్రూపుల్లో ఐదుగురు చేరారు. కాగితాపల్లి, అరసాడ, అంబాడ వెంకటాపురం ఉన్నత పాఠశాలలో ఇటీవల 10 పరీక్షల్లో 180 మంది ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. కనీసం రెండు గ్రూపుల్లో 20 మంది జాయిన్ అయ్యేలా చర్యలు తీసుకోవాలని డిప్యూటీ డిఇఒ మోహనరావు ఎంఇఒల ఎం.వరప్రసాదరావు, ఎరకయ్యలకు ఆదేశించారు. వీరితోపాటు వంగర ఎంఇఒ దుర్గారావు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉన్నారు. కళాశాల ఏర్పాటుతో మండలంలోని పలు గ్రామాల విద్యార్థులకు ఎంతో మేలు జరగనుంది.

వయోజనులకు క్షయ నివారణ టీకా

- పరిశీలించిన డిఎంహెచ్‌ఒ భాస్కరరావు
- డెంగీపై పలుచోట్ల అవగాహన ర్యాలీలు

ప్రజాశక్తి-విజయనగరం కోట

జిల్లా వ్యాప్తంగా గురువారం వయోజనుల క్షయ నివారణ టీకా కార్యక్రమం ప్రారంభమైంది. రాకోడు పిహెచ్‌సి పరిధిలో చెల్లూరు హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్ ను డిఎంహెచ్‌ఒ డాక్టర్ భాస్కరరావు సందర్శించి జరుగుతున్న టీకా కార్యక్రమాన్ని పరిశీలించారు. వైద్య ఆరోగ్య సిబ్బందికి ముఖ్యమైన మార్గదర్శకాలు, వ్యాక్సిన్ వెయ్యవలసిన వారికి ఆరు ప్రమాణాల గురించి తెలిపారు. గత ఐదేళ్లలో టిబి వచ్చి తగ్గిపోయిన వారు, 18ఏళ్లు నిండిన వారు, పొగ తాగేవారు, సుగర్ వ్యాధి ఉన్న వారు, టిబి రోగులతో సన్నిహిత సంబంధాలు తప్పనిసరిగా టీకా వేసుకోవాలని తెలిపారు. వ్యాక్సిన్ వేసిన తర్వాత వ్యాక్సిన్ వేసిన చోట బొబ్బ గాని మచ్చ గాని ఏర్పడుతుందని, దీనివల్ల భయపడాల్సిన అవసరం లేదని వారికి భరోసా ఇవ్వాలని సిబ్బందికి తెలిపారు.

జాతీయ డెంగీ దినాన్ని పురస్కరించుకొని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం వద్ద అవగాహన ర్యాలీని డిఎంహెచ్‌ఒ ప్రారంభించారు. అనంతరం



వేపాడలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది

మాట్లాడుతూ డెంగ్యూ నిర్ధారణ పరీక్ష కేవలం విజయనగరం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి, రాజాం ప్రాంతీయ ఆసుపత్రిలో మాత్రమే ర్యాపిడ్ టెస్ట్ కిట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ప్రజలంతా వారానికి ఒకసారి డ్రైడే పాటించి దోమల వ్యాప్తిని అరికట్టాలని కోరారు. కార్యక్రమంలో డిఎంఒ వై.మణి, ఎపిడిమోలాజిస్ట్ జి. వెంకటేష్, డిసిఎం బి. మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

డెంగీపై అవగాహన ర్యాలీలు

వేపాడ : జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా వేపాడ, బొద్దాం పిహెచ్‌సి వైద్యుల ఆధ్వర్యాన గురువారం అవగాహన ర్యాలీలు చేపట్టారు. వేపాడ, బొద్దాం, కెజిపూడి, పాతవూరు, చిట్టివానిపాలెం, శొంటివానిపాలెం గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా క్షయ వ్యాధి బారిన పడకుండా వ్యాధి నిరోధక టీకాలు వేశారు. ఈ కార్యక్రమాన్ని జోనల్ మలేరియా అధికారి డాక్టర్ ఎం.శాంతిప్రభ, జిల్లా మలేరియా అధికారి వై.మణి పర్యవేక్షించారు. ఈ కార్యక్రమాల్లో వైద్యాధికారులు ఎ.ధరణి, రమాదేవి, శివాని, సిహెచ్‌ఒ ఆంజనేయులు, సర్పంచుల సంఘం మండల అధ్యక్షులు ఎన్.వెంకటరావు, సూపర్‌వైజర్ మూర్తి, వైద్య సిబ్బంది దాలినాయుడు, శేఖర్‌బాబు, వెంకటరావు, రాజశేఖర్, సత్య, తదితరులు పాల్గొన్నారు.

శృంగవరపుకోట : కొట్టాం పిహెచ్‌సి ఆధ్వర్యంలో బొడ్డవర, కొట్టం, శృంగవరపుకోటలో డెంగీపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. డెంగీ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్యులు జె.హారిక, బి.శిరీష, ఎన్.మానస వివరించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది వి.సన్యాసప్పడు, వరలక్ష్మి, శంకర్రావు, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

పూసపాటిరేగ : సమాజం బాగస్వామ్యంతో డెంగీ వ్యాధిని నివారిద్దామని పూసపాటిరేగ పిహెచ్‌సి వైద్యులు రాజేష్‌వర్మ, ప్రమీలాదేవి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రపంచ డెంగీ దినోత్సవం సందర్భంగా అవగాహనా ర్యాలీని వైద్య సిబ్బంది నిర్వహించారు. ఈ సందర్భంగా

రాకోడులో వ్యాక్సినేషన్‌ను పరిశీలిస్తున్న డిఎంహెచ్‌ఒ డాక్టర్ భాస్కరరావు

ఆయన మాట్లాడుతూ ప్రతి శుక్రవారం ఇంటిలోపల, ఇంటూ చుట్టూ పక్కల నీటి నిల్వలను తొలగించాలన్నారు. ప్రజా అవగాహనతో డెంగీ వ్యాధిని నివారించవచ్చున్నారు. ర్యాలీలో ఆరోగ్య విద్యాభోదకులు మహేశ్వరి, సూపర్‌వైజర్ నాగమ్మ, ఉమాపతి, ఆరోగ్య సహాయకులు ఆర్‌వి రమణ, బంగారుబాబు తదితరులు పాల్గొన్నారు.

పూసపాటిరేగలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

వైసిపిలో కలవరం

- సొంత పార్టీ కార్యకర్తల పట్ల నిర్లక్ష్యం
- భూహక్కు చట్టంపై టిడిపి విస్తృత ప్రచారం
- అయినా ఓటింగ్ శాతం పెరుగుదలతో గెలుపు తమదే అంటున్న అభ్యర్థులు

ప్రజాశక్తి - సాలూరు

పార్వతీపురం మన్యం జిల్లాలో వైసిపి శ్రేణులను ప్రభుత్వ వ్యతిరేక పవనాలు కలవం పెడుతున్న పరిస్థితి కనిపిస్తోంది. సంక్షేమ పథకాలను నేరుగా లబ్ధిదారులకే చేరవేశామని, నగదు బదిలీ ద్వారా పేదల ఖాతాల్లో లక్షలాది రూపాయలు జమ చేశామనే ధీమా అధికారపార్టీ నాయకుల్లో బలంగా ఉంది. దేశంలో ఏ రాష్ట్రంలోనూ ఇవ్వని విధంగా అత్యధిక మొత్తంలో పింఛను, అధిక సంఖ్యలో ఫించన్లను వాలంటీర్ల తో లబ్దిదారుల ఇళ్లకే అందిస్తున్న ప్రభుత్వం తమదేనని ఆ పార్టీ నాయకులు గర్వంగా చెప్పుకున్నారు. నవరత్నాలనే సంక్షేమ పథకాలకు అర్హులైన పేదలకు లక్ష నుంచి పది లక్షల వరకు లబ్ధి చేకూరిందని, వారి ఓట్లు వైసిపికే పడతాయనే ఆత్మవిశ్వాసం పైకి కనిపించినా లోలోపల ఏదో ఒక రూపంలో భయం వెంటాడుతున్నట్లు తెలుస్తోంది. 2019 ఎన్నికల్లో ఒక్క ఛాన్స్ ఇవ్వాలని కోరుతూ ప్రజాసంకల్ప యాత్రతో అనూహ్య రీతిలో వైసిపి ప్రజాదరణ పొందింది. ఆదరణకు తగినట్లుగానే ఆ ఎన్నికల్లో ఓటర్లు వైసిపికి అనూహ్యరీతిలో అనుకూల తీర్పు ఇచ్చారు.

2014 నుంచి 2019వరకు టిడిపి ప్రభుత్వం హయాంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమవడాన్ని వైసిపి విస్తతంగా ప్రజల్లోకి తీసుకెళ్ళింది. 2019లో అధికారంలోకి వచ్చిన తర్వాత నవరత్నాలనే సంక్షేమ పథకాలు అమలు మాత్రమే తమ ముందున్న ప్రథమ కర్తవ్యమన్న రీతిలో ప్రభుత్వం వ్యవహరించింది.దీని వల్ల రోడ్లు, భవనాలు, వంతెనల నిర్మాణం వంటి అభివృద్ధి పనుల పట్ల కొంత నిర్లక్ష్యం వహించింది. మద్య నిషేదం అమలు చేయడం లో విఫలమవడం, విచ్చలవిడిగా బెల్ట్ షాపులకు తెరలేపడం, సామాన్య ప్రజలు వినియోగించే మద్యం ధరలు భారీగా పెంచడం వంటి అంశాలు అధికారపార్టీకి ప్రతికూల ప్రభావం చూపించే అవకాశాలున్నాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రభుత్వం తీసుకొచ్చిన భూహక్కు చట్టంపై టిడిపి నాయకులు చేసిన ప్రచారం కూడా అధికారపార్టీకి కొంత తలనొప్పిగా మారింది. సంక్షేమ పథకాల అమలుతో అది కొట్టుకుపోతుందనే భావం ఆ పార్టీ నాయకులలో కనిపించింది. నవరత్నాలనే పథకాల ద్వారా నగదు బదిలీ చేయడం ఒక్కటే తమను మళ్ళీ అధికారంలోకి తెస్తుందని వైసిపి నాయకులు భావిస్తున్నారు. పెరిగిన ఓటింగ్ శాతాన్ని బట్టి వైసిపి పట్ల ఆదరణకు సంకేతమని అధికారపార్టీ నాయకులు అంటున్నారు.

జిల్లాలోని మూడు ఎస్టీ నియోజక వర్గాలు, ఒక ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గంలో అధికారపార్టీ పైకి చూడడానికి బలంగా కనిపిస్తోంది. కానీ తాజా ఎన్నికల్లో వైసిపి సిటింగ్ ఎమ్మెల్యే లందరికీ ముచ్చెమటలు పట్టాయని చెప్పొచ్చు. ఓటింగ్ సరళిని పరిశీలిస్తే నలుగురు సిటింగ్ ఎమ్మెల్యేల్లో ఎంతమంది విజేతలుగా నిలుస్తారో అంతు చిక్కడం లేదు. ప్రభుత్వ వ్యతిరేకత కన్నా స్థానిక ఎమ్మెల్యేలపై ప్రజావ్యతిరేకత ఎక్కువగా వుండడంతో కొంతమందికి ఈ ఎన్నికల్లో ఎదురీత తప్పలేదని భావిస్తున్నారు. సాలూరులో ప్రభుత్వ వ్యతిరేకత తప్ప సిటింగ్ ఎమ్మెల్యే గా రాజన్నదొరపై చెప్పుకోదగిన స్థాయిలో ప్రజావ్యతిరేకత లేదు. అయితే టిడిపి అభ్యర్థి సంధ్యారాణి సృష్టించిన సెంటిమెంట్ అస్త్రం ఆమెకు కొంతమేర అనుకూలించినట్లు తెలుస్తోంది. రెండు సార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి ఎంపీగా పోటీ చేసి ఓడిపోయానని, తనకో ఛాన్స్ ఇవ్వాలని ప్రాధేయపడిన తీరు ప్రజల సానుభూతి పొందడానికి దోహదపడింది. ఇలాంటి పరిస్థితుల్లో వైసిపి అభ్యర్థి రాజన్నదొరకు సంధ్యారాణి గట్టి పోటీ ఇచ్చారు. పార్వతీపురం నియోజకవర్గంలో సిటింగ్ ఎమ్మెల్యే అలజంగి జోగారావు కూడా రెండోసారి బరిలో వున్నారు. గత ఐదేళ్లలో ఆయన ప్రజావ్యతిరేకతను మూటగట్టుకున్నారని ప్రచారం జరిగింది. విచ్చలవిడి అవినీతి ఆరోపణలు, భూకబ్జా వంటి అంశాలు అధికారపార్టీ ఎమ్మెల్యేగా జోగారావు పై సొంత పార్టీ లోనే వ్యతిరేకతను పెంచేశాయి. ఈ నేపథ్యంలో ఆయన గెలుపు అంత సునాయాసం కాదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. డబ్బు మంచినీరు మాదిరి ఖర్చు చేయడం, టిడిపిలో గ్రూపు రాజకీయాలు వల్ల వైసిపి అభ్యర్థి జోగారావు అతి కష్టంగానైనా గట్టెక్కవచ్చునని ప్రచారం జరుగుతోంది. ఇక కురుపాం నియోజకవర్గం లో మాజీ మంత్రి, సిటింగ్ ఎమ్మెల్యే పుష్ప శ్రీవాణి అందరి కన్నా ఎక్కువ గడ్డు పరిస్థితిని ఎదుర్కొన్నట్లు తెలుస్తోంది. ఇక్కడ కూడా ఆమె ఊహించని రీతిలో ప్రజావ్యతిరేకతను మూటగట్టుకున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తొలి విడత లోనే డిప్యూటీ సిఎం పదవి పొందిన పుష్ప శ్రీవాణి తమను పట్టించుకోకపోవడం పట్ల గిరిజనుల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది.

గిరిజన ఎమ్మెల్యే గా ఆమె రెండు సార్లు గెలిచినా గిరిజన సమస్యల పట్ల నిర్లక్ష్యం, అవినీతి ఆరోపణలు వైసిపిపై అసంతృప్తిని తారాస్థాయికి తీసుకెళ్లాయని చెప్పొచ్చు. పాలకొండలోనూ సిటింగ్ ఎమ్మెల్యే వి.కళావతి కొంతమేర గడ్డు పరిస్థితిని ఎదుర్కొన్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. పేరుకే ఎమ్మెల్యేగా వున్నప్పటికీ ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ కనుసన్నల్లో పని చేయడం, అవినీతి ఆరోపణలు అధికారపార్టీ పై ప్రతికూల ప్రభావం చూపించే అవకాశాలు ఉన్నాయి. అయితే ప్రతిపక్ష కూటమి నాయకుల మధ్య అంతర్గత విభేదాలు కళావతికి మేలు చేస్తాయనే అభిప్రాయం కూడా వ్యక్తమవుతోంది. ప్రభుత్వంపై వ్యతిరేకత, సిటింగ్ ఎమ్మెల్యే లపై అసంతృప్తి వెరసి అధికారపార్టీకి మన్యం జిల్లా లో చెమటలు పట్టించాయని చెప్పొచ్చు. అధికారపార్టీ నాయకులు పైకి మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నా లోలోన వారిని ఓటమి భయం వెంటాడుతున్న పరిస్థితి కనిపిస్తోంది.

గ్రామాల్లో బెట్టింగ్‌ల జోరు

ప్రజాశక్తి- మెరకముడిదాం

మొన్నటి వరకు ఎన్నికల హడావిడితో గ్రామాలలో సందడి చేసిన రాజకీయ నాయకులు ఓటింగ్ అనంతరం నియోజకవర్గ, జిల్లా కేంద్రాల్లో కూర్చుని లెక్కలు వేసుకుంటున్నారు. ఇప్పుడు పల్లెల్లో, మండల కేంద్రాలలో ఇరు పార్టీల నాయకులు తమ గ్రామాలలో బూత్ ల వారి లెక్కలు వేసుకొని వారికున్న అంచనాలు ప్రకారం తమ పార్టీ అధికారంలోకి వస్తుందని, మరి కొంతమంది తమపార్టీ అధికారంలోకి వస్తుందని బెట్టింగ్‌లు వేసుకుంటున్నారు. ఒక చిన్న మారు మూల గ్రామంలో కూడా ఇంచుమించు రూ.30లక్షలు వరకు బెట్టింగ్‌లు వేస్తున్నారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చును. కొంత మంది తమ గ్రామంలో టిడిపికి మెజారిటీ వస్తుందని మరికొంత మంది రాదని పందేలు వేసుకుంటున్నారు. రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలోకి వస్తుందన్న దానిపై కూడా పెద్ద ఎత్తున పందేలు కాస్తున్నారు. వైసిపికి 63 సీట్లు కంటే ఎక్కువ రావని టిడిపి అంటే 120 సీట్లతో జగన్ మోహనరెడ్డి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తారని లక్షల్లో బెట్టింగ్ కాస్తున్నారు. ఈ బెట్టింగ్‌కి వైసిపి కంటే టిడిపి వాళ్లే ముందుకు రావటం ఆచార్యాన్ని కలిగిస్తుంది. టిడిపికి కాస్త జనసేన పార్టీ కుర్రోళ్ళు తొడవటంతో వారు బెట్టింగ్ హోరు గ్రామాలలో బాగా కనిపిస్తుంది. గ్రామ గ్రామానికి ఒక పందెం, ఎమ్మెల్యే స్థాయికి ఒక పందెం, రాష్ట్రంలో అధికారం కోసం మరో పందెం ఇలా మూడు రకాలుగా పందేలు జోరుగా సాగుతున్నాయి.

ఇళ్ల ముందు నిలిచిపోయిన మురుగునీరు

కంపుకొడుతున్న కాలువలు

ప్రజాశక్తి-వేపాడ

వల్లంపూడి గ్రామంలోని కాలువల్లో మురుగునీరు నిల్వ ఉండిపోవడంతో కంపుకొడుతున్నాయి. గ్రామంలో ప్రధాన రహదారిలో ఏర్పాటు చేసిన సిమెంట్ రోడ్డుకు ఇరువైపులా ఉన్న కాలువలున్నాయి. రైతు భరోసా కేంద్రం వద్ద కాలువకు అడ్డంగా మట్టివేశారు. దీంతో మురుగునీరు కాలువలో నిలిచిపోతోంది. దీంతో స్థానికులు దుర్గంధంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

కోడ్ అమల్లో ఉంది... తస్మాత్ జాగ్రత్త

రామభద్రపురం : ఎన్నికల కోడ్ జూన్ 4వరకు అమల్లోనే ఉంటుందని ప్రజలంతా తస్మాత్ జాగ్రత్తగా వ్యవహరించాలని బొబ్బిలి రూరల్ సిఐ తిరుమలరావు తెలిపారు. గురువారం ఆరికతోటలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల అనంతరం పలు ప్రాంతాల్లో జరుగుతున్న అల్లర్లు చూస్తున్నామని, నాయకులపై అభిమానాన్ని మనసులో ఉంచుకోవాలని, ఎదుట వ్యక్తిని రెచ్చగొట్టేలా ప్రవర్తించరాదని తెలిపారు.